క్లుప్తంగా

నులిపురుగుల నివారణలో భాగస్వాములు కావాలి

మిరుదొడ్డి(దుబ్బాక): నులిపురుగుల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని మిరుదొడ్డి పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా అన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై పీహెచ్‌సీలో శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 ఏళ్ల లోపువారిని గుర్తించి వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, తహసీల్దార్ గోవర్ధన్, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సీహెచ్‌ఓ లింగమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు లింగం, ధర్మారం మల్లయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్ తెగిపడి రెండు గేదెలు మృతి



రోదిస్తున్న బాధితుడు సాయిలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుత్‌వైర్ తెగి మేత మేస్తున్న గేదెలపై పడడంతో రెండు గేదెలు విద్యుత్ షాక్ గురై మృతి చెందాయి. ఈ ఘటన మండల కేంద్రం చిలప్‌చెడ్ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, గేదెల యజమాని మల్లుగళ్ల సాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు ప్రతీ నిత్యం మాదిరిగానే గేదెలను గ్రామ శివారులో మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న గేదెలపై అకస్మాత్తుగా విద్యుత్ వైరు తెగిపడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ సమాచారాన్ని విద్యుత్ సిబ్బంది తెలియజేయడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని, విద్యుత్ నిలిపివేశారు. దీంతో పాటు మృతి చెందిన గేదెలను పరిశీలించారు. కాగా మృతి చెందిన గేదెల విలువ 1.8 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

చెక్కు అందజేత



రైతుకు చెక్కు అందిస్తున్న సహకార సంఘం చైర్మన్ చంద్రం

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి గిరిజన తండాకు చెందిన రైతు మేగావత్ చందర్‌కు కోళ్ల ఫారం ఏర్పాటు కోసం సహకార సంఘం నుంచి రుణం మంజూరైంది. ఈమేరకు సహకార సంఘం చైర్మన్ చంద్రం రూ. 7,12,500 చెక్కును శనివారం చందర్‌కు అందజేశారు. సంఘం సీఈఓ నర్సింలు, ఇతరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

కొల్చారం(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాకేశ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లేశం, శేఖర్, యాదయ్య, భిక్ష పతి, రాములు, ప్రభు, సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న, అంగన్‌వాడీ టీచర్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని ఆరవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీమంతం, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లు నిండిన పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. 5 సం.లు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ మంగేశ్వరి తల్లులకు సూచించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్‌ఎం పద్మ, ఆయా సంతోషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో విద్యార్థులకు మేలు

- ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి



టేక్మాల్‌లో పుస్తకాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పథకాలతో నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి తెలిపారు. శనివారం మండల కేంద్రం టేక్మాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రభుత్వ అన్ని రకాల వసతులను కల్పిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం వంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఎంపీపీ స్వప్న, మండల కోఆప్షన్ సభ్యులు మజహర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బాలమణి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు.

పుస్తకాల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు హెచ్‌ఎం సరోజ, ఉపాధ్యాయులు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతీరోజు పాఠశాలకు విద్యార్థులు రావాలని, శ్రద్ధగా చదవాలని హెచ్‌ఎం అన్నారు.

దుస్తులు అందజేత

రామాయంపేట(మెదక్): బడిబాటలో భాగంగా మండలంలోని కోనాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాలలో హెచ్‌ఎం రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, మహేశ్వరి, పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): వల్లూర్‌లో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



రామాయంపేట(మెదక్): విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం రవీందర్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం వల్లూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వల్లూర్ పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రవల్లిక, బీజేపీ దుబ్బాక కన్వీనర్ గోవింద్, నాయకులు రాకేశ్, శ్రీనివాస్, ఆంజనేయులు, డాక్టర్ నర్సింలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిస్థితిపై ఆరా



శ్రీనివాస్ ఆరోగ్యస్థితిపై ఆరా తీస్తున్న ఆరోగ్యమిత్ర, బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

వెల్దుర్తి(తూప్రాన్): ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు అంటూ మంచం బారిన పడిన ఉద్యమకారుడు ముల్క శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ డీఎం విజయభాస్కర్ ఆదేశంతో రాజీవ్ ఆరోగ్య శ్రీ అధికారి ఆరోగ్యమిత్ర శ్యాం ప్రసాద్ శనివారం అతని కుటుంబాన్ని సందర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాలేయ సంబంధ వ్యాధి చికిత్సకు ఇప్పటివరకు అయిన ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలేయ మార్పిడి చికిత్సకు నిమ్స్ ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీలో జీవన్‌దాన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబసభ్యులు, ఎవరైనా దాతలు ముందుకు వస్తే కాలేయ మార్పిడికి అయ్యే శస్త్రచికిత్స నిమ్స్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేసుకోవచ్చన్నారు. ఈ క్రమంలోనే డీఎం ఫోన్ ద్వారా శ్రీనివాస్ ఆరోగ్యస్థితిపై అడిగి తెలుసుకొని పలు సలహాలు, సూచనలు అందజేశారు. సుమారు యేడాదికిపైగా వైద్యానికి సుమారు రూ.10లక్షల వరకు ఖర్చు అయ్యాయని ప్రస్తుతం కాలేయ మార్పిడి చికిత్సకు ప్రైవేట్‌లో తాము రూ.35లక్షలు చెల్లించుకునే పరిస్థితిలో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాజీవ్ ఆరోగ్య శ్రీ జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకుంటే వీలైనంత త్వరగా శస్త్రచికిత్స జరిగేలా చూస్తానని అధికారి హామీనిచ్చారు. మండల బీఆర్‌ఎస్ నాయకులు, కోదండ కృష్ణాగౌడ్, నాయకులు శ్రవణ్ కుమార్ శ్రీనివాస్ ఆరోగ్యస్థితి అడిగి తెలుసుకున్నారు.

పిల్లలు బాగా చదువుకోవాలి



అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న హెచ్‌ఎం

టేక్మాల్(మెదక్): పిల్లలు బాగా చదువుకోవాలని హెచ్‌ఎం కృష్ణ అన్నారు. మండలంలోని వెల్పుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు మల్లప్ప, ఎల్లమ్మ, నాగరాణి, మాధవి, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాఘవేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సంగమని, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్): అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి నీరజ మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్ల వయసు చిన్నారులను కచ్చితంగా అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శైనీ సువర్ణ ఉపాధ్యాయులు శారద, రేఖ, విజయలత, రమ, లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, స్వర్ణలత, పద్మ, వాణి, సుగుణ తదితరులు ఉన్నారు.

నేడు నల్లపోచమ్మకు బండ్ల ఊరేగింపు

మెదక్ మున్సిపాలిటీ: మృగశిర కార్తెను పురస్కరించుకొని ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌లో వెలసిన నల్ల పోచమ్మకు బండ్లను ఊరేగించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పట్టు వస్త్రాలు, విశేష పుష్పాలంకరణ, పూజలు నిర్వహించనున్నారు. అలాగే అమ్మవారికి ఓడి బియ్యం సమర్పణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి బండ్లను ఊరేగిస్తారు.

జీలుగ సాగుపై రైతులకు అవగాహన



జీలుగ సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి గంగుమల్లు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్, రావెల్లి గ్రామాల్లో జీలుగ పంట పొలాలను మండల వ్యవసాయాధికారి గంగుమల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూత దశలో ఉన్న జీలుగను పొలంలోనే కలియదున్నాలని తెలిపారు. జీలుగ దున్నిన తర్వాత 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ దుక్కిలో వేయాలన్నారు. దీంతో మొక్కల అవశేషాలు పొలంలో కుళ్లి ఎరువుగా తయారవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా క్రీడా ప్రాంగణం



పైతరలోని క్రీడా ప్రాంగణం

కొల్చారం(నర్సాపూర్): నిర్వహణ లోపంతో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో క్రీడా ప్రాంగణం నిండిపోయింది. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్మించిన క్రీడా ప్రాంగణం వర్షాకాలం కావడంతో విష సర్పాలు, పురుగులకు నిలయంగా మారింది. ఇది మండలంలోని పైతర గ్రామంలోని క్రీడా ప్రాంగణం దుస్థితి.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఎల్బీ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఉమాలక్ష్మీకాంతారావు, మాజీ సర్పంచ్ అశోక్, తదితరులు ఉన్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువు తండా, లింగంపల్లి, వెంకటాపూర్(ఆర్), కుషన్‌గడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం ఈ సందర్భంగా కొత్తచెరువుతండాలో ఏఎన్‌ఎం రాజమణి, మజీదాబేగం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మహిళలు రక్తహీనతను నివారించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చండూర్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ ఇంతెజార్ ఉన్నీసా బేగం అన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శ్రీశైలం, ఏఎన్‌ఎం భాగ్య, అంగన్‌వాడీ టీచర్ శశికళ పాల్గొన్నారు.

◆ ఆలయంలో అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలలోని వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు మెట్టు రాములుశర్మ శనివారం ఆంజనేయస్వామికి చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ రామాయంపేట సీఐగా వెంకట రాజాగౌడ్

రామాయంపేట(మెదక్): రామాయంపేట సీఐగా వెంకటరాజాగౌడ్ నియమితులయ్యారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్‌ను హెడ్‌క్వార్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆశాఖ అధికారులు ఆదేశించారు. వెంకటరాజాగౌడ్ సంగారెడ్డి ఏసీబీలో పనిచేస్తున్న క్రమంలో ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. ఆదివారం ఆయన రామాయంపేటలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి



చేగుంట తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు



మనోహరాబాద్(తూప్రాన్): తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): గోవుల అక్రమ రవాణా, గోవధను అడ్డుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన గోవధ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల యువమోర్చా అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, దళితమోర్చా అసెంబ్లీ కన్వీనర్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధించాలి

వెల్దుర్తి(తూప్రాన్): గోవుల అక్రమ రవాణా అరికట్టడంతో పాటు గోవధ పూర్తిగా నిషేధించాలని వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు కోరారు. ఈ మేరకు వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్, తహసీల్దార్ తులసీరాంకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చందు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, గణేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): గోవధతో పర్యావరణం దెబ్బతింటుందని విశ్వహిందూపరిషత్ నాయకులు తహసీల్దార్ గియాసున్నీసాబేగంకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు సోమ సురేష్, వేణుగౌడ్, భిక్షపతి, భూపాల్ రెడ్డి, బాలేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

గో హత్యను అరికట్టాలి

చిన్నశంకరంపేట(మెదక్): గోవుల అక్రమ రవాణను అరికట్టాలని బీజేవైఎం జిల్లా కోశాధికారి మధు కోరారు. ఎస్‌ఐ నారాయణగౌడ్‌కు బీజేవైఎం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు రాజు, బీజేవైఎం నాయకులు బాబు, ప్రసాద్, రామ్‌ప్రసాద్, సర్దార్, సతీష్ పాల్గొన్నారు. విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నారాయణగౌడ్, తహసీల్దార్ మన్నన్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సప్తక్ రవీందర్, మహేశ్, భజరంగ్ దళ్ మండల ప్రకండ స్యోజక్ దుర్గం నవీన్‌గౌడ్, టీ.మాందాపూర్ మహేందర్, సురేశ్, మల్లేశ్ యాదవ్, రాములు, సురేష్, అనిల్ ఉన్నారు.



వెల్దుర్తిలో..



కౌడిపల్లి పీఎస్‌లో ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో గోవధను అడ్డుకోవాలని మండల వీహెచ్‌పీ కార్యకర్తలు మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తూప్రాన్ ప్రఖండ ప్రముఖ్ అనిల్‌గౌడ్, సాయి కుమార్, మణివర్ధన్, శివాజీ పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్‌ఐ రాజయ్య

రేగోడ్(మెదక్): బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శనివారం రేగోడ్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశంలో ఎస్‌ఐ రాజయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మల్లయ్య, సిబ్బంది సాయిలు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు చోటు మియా, మాజీ సర్పంచ్‌లు సంగమేశ్వర్, సునీల్ కుమార్, చిద్రే కృష్ణ, ఇస్మాయిల్, ఖదీర్, రాచన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): బక్రీదు పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. పెద్దశంకరంపేటలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గోవధ నిషేధమని, పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించకుండా పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, నాయకులు నారాగౌడ్, రాజేందర్‌గౌడ్, గంగారెడ్డి, భానుగౌడ్, శ్రావణ్, సలీం, ముల్తానీ, ముక్రమ్, హైమద్, వసీం తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఎస్‌ఐ.శంకర్

పంచాయతీ భవనానికి రోడ్డు వేయండి

పాపన్నపేట(మెదక్): డాక్య పంచాయతీ భవనానికి రోడ్డు మంజూరు చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంకు శనివారం మాజీ సర్పంచ్ హీరాలాల్ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పంచాయతీ భవనానికి కొన్నేళ్ల నుంచి ప్రైవేట్ దారి వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల దారి ఇచ్చిన వ్యక్తి దారిని బండరాళ్లతో మూసివేశాడని తెలిపారు. అధికారులు స్పందించి కొత్త రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

మున్సిపాలిటీలో మురుగు కాల్వ పరిశీలన



12వ వార్డులో మురుగు కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని మురుగుకాల్వలు, వీధిలైట్లు ఏర్పాటు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీవాసులతో చర్చించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రవీందర్ రెడ్డి, రఘుపతి, నాయకులు నాగులు, నర్సింలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులను పట్టుకొని పోలీసులకు అప్పగింత

నర్సాపూర్: మండలంలోని కాగజ్‌మద్దూర్ నుంచి తరలిస్తున్న మూడు పశువుల(ఎండ్లు)ను పట్టుకొని పోలీసులకు అప్పగించామని బీజేవైఎం నాయకులు అనిల్, రాజేష్, వంశీగౌడ్ తెలిపారు. బక్రీద్ పండుగ కోసం తరలిస్తుండగా తాము పట్టుకున్నామని వారు తెలిపారు. కాగజ్‌మద్దూర్ నుంచి హైదరాబాద్‌కు ఆటోలో తరలిస్తుండగా తాము పట్టుకున్నామని వారు చెప్పారు. మూడు పశువులను గోశాలకు తరలించినట్లు పోలీసులు చెప్పారు.



పశువులను తరలిస్తున్న వాహనంతో బీజేవైఎం నాయకులు

గుంతలు తీశారు.. పూడ్చడం మరిచారు



చండూర్ మలుపు వద్ద తీసిన గుంత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని పలు గ్రామాల ప్రధాన రహదారుల పక్కనే ఇంటర్నెట్ కేబుల్ ఏర్పాట్లకై గుంతలు తీశారు. ఈ గుంతలు తీసి నెలలు గడుస్తున్నా.. గుంతలను మాత్రం పూడ్చేయడం లేదు. ఈ గుంతలు ప్రధాన రోడ్ల పక్కన, మూలమలుపుల వద్ద ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా చండూర్ గ్రామంలోకి వెళ్లే మూలమలుపు వద్ద తీసిన గుంత ప్రమాదకరంగా ఉంది. రాత్రి వేళలో ప్రయాణికులు ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. ఈ విషయమై అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.